www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -156 ఆదివారం 20 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి : ప్రజలను కోరిన సీఎం రేవంత్



**హైదరాబాద్‌సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరంగల్ (మామునూరు) విమానాశ్రయానికి సముచితమైన పేరును సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం మిగతా 2లో...

# విద్యార్థులకు నాణ్యమైన సామాగ్రి ఇవ్వాలి



**మరిన్ని రంగుల్లో యూనిఫామ్స్ ఇవ్వండి**

**వచ్చే ఏడాది కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక చేయాలి**


**సమీక్షా సమావేశంలో సీఎం ఏ రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్ సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**
రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని చెప్పారు. శనివారంనాడాయన విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పీ సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులుతోపాటు వివిధ శాఖలమిగతా 2లో...

# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ
- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన

**ఢిల్లీ సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**
దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.
20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు మిగతా 2లో...



## తిరుమలలో వైభవంగా గరుడ సేవ..

**రెండు లక్షల మంది భక్తులతో పోటెత్తిన మాఢవీధులు**

**శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ**

**గరుడ వాహనంపై భక్తులను కటాక్షించిన మలయప్ప స్వామి**

**లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**

**గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమల కొండ**

**భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు, నిరంతర పర్యవేక్షణ**



**తిరుమలసెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**
తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపురూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చినమిగతా 2లో...

## అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం



**హైదరాబాద్‌సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**
ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు.
బీఆర్ఎస్ తరపున గెలిచి, మిగతా 2లో...

## కొత్త రూల్‌పై గందరగోళం




**యూపీఐ చెల్లింపులపై కొత్త ఛార్జీలు.. నిరసనకు దిగిన వ్యాపారులు..**

**రూ.2000 దాటిన యూపీఐ లావాదేవీలపై కొత్త ఛార్జీల ప్రతిపాదన**

**నిరసనగా యూపీఐ చెల్లింపులు నిలిపివేస్తామంటున్న వ్యాపారులు**

**అక్టోబర్ 15 నుంచి నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆందోళన**

**ఈ ఛార్జీ వ్యాపారులకే తప్ప, వినియోగదారులకు కాదంటున్న ప్రభుత్వం**

**95 శాతం లావాదేవీలపై ప్రభావం ఉండదని స్పష్టీకరణ**




## భారతీయులకు పెరిగిన వీసా టెన్షన్

**అమెరికా యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థుల దెబ్బ..**

**వీసా జాప్యం, తిరస్కరణలే ప్రధాన కారణాలు**

**63 శాతం యూనివర్సిటీ అధికారుల్లో ఇమ్మిగ్రేషన్‌పై ఆందోళన**

**విదేశీ విద్యార్థులు తగ్గడంతో 73 శాతం సంస్థల ఆదాయంతో తగ్గుదల**

**భారతీయ విద్యార్థులకు కీలకంగా మారిన వీసా పరిస్థితులు**

**ఢిల్లీ సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**
అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకునే విదేశీ విద్యార్థులకు పరిస్థితులు ఏమంత ఆశాజనకంగా కనిపించడం లేదు. 2026 విద్యా సంవత్సరానికి అమెరికాలోని సగానికి పైగా కాలేజీలు, యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థులమిగతా 2లో...

## యువతే తెలంగాణకు అతిపెద్ద బలం

**వికసిత్ భారత్ లో తెలంగాణది కీలక పాత్ర**

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం: డిప్యూటీ సీఎం**



**న్యూఢిల్లీ: (ప్రజావినికిడి):**వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగామిగతా 2లో...

# ఎకరం ఎండినా సీఎందే బాధ్యత

### ఎల్ నినో రాష్ట్రంలోనే ఉందా! ఆంధ్రా, కర్నాటకలో లేదా.?

**ప్రకృతిది కాదు..కాంగ్రెస్ తెచ్చిన కరువు రేవంత్ రెడ్డిది అసమర్థ పాలన..**

**పార్టీ ఫిరాయింపులో హైకోర్టు తీర్పు చెంపపెట్టు? : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**వనపర్తి జిల్లాలో జూరాల కాలువ, సబ్ స్టేషన్ల పరిశీలన**

**పెబ్బేరుసెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**
'ఎల్ నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రంలోనే ఉందా! ఆంధ్రా, కర్నాటక రాష్ట్రాలలో లేదా.? రైతులకు నీళ్లు ఇవ్వలేని రేవంత్ రెడ్డిది.. అసమర్థ పాలన. ఎకరం పొలం ఎండినా సీఎందే బాధ్యత. ఇది ప్రకృతి తెచ్చినది కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. శనివారం కొల్లాపూర్ పర్యటనలో భాగంగా వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో పర్యటించిన కేటీఆర్ జూరాలమిగతా 2లో...



## జపాన్‌లో20వ ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభం

**భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ**

**ప్రారంభోత్సవంలో పతాకధారులుగా షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్**

**గత ప్రదర్శనను అధిగమించి మరిన్ని పతకాలు గెలవాలనే లక్ష్యంతో భారత్**

**క్రికెట్, కబడ్డీ, హాకీలో టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తున్న టీమిండియా**




**ఢిల్లీ సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**
ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబరం మొదలైంది. జపాన్‌లోని ఐచీ-నగోయా నగరాలు వేదికగా 20వ ఆసియా క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన అట్టహాస వేడుకలో జపాన్ చక్రవర్తి నరుహిటో ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. రాబోయే రెండు వారాల పాటు వేలాది మంది క్రీడాకారులు పతకాలమిగతా 2లో...

# తిరుమలలో వైభవంగా గరుడ సేవ..

**మొదటిపేజీ తరువాయి**

భక్తుల "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి.శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు.గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు,



తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు.

వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

# కొత్త రూల్‌పై గందరగోళం

**యూపీఐ చెల్లింపులపై కొత్త ఛార్జీలు.. నిరసనకు దిగిన వ్యాపారులు..**

**ఢిల్లీ సెప్టెంబర్ 1(ప్రజావినికిడి):**
దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి కారణమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కొత్తగా ఛార్జీలు విధించాలన్న ప్రతిపాదన వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది. ఘజియాబాద్‌లోని పలువురు వ్యాపారులు దీనికి నిరసనగా తమ దుకాణాల ముందు 'యూపీఐ చెల్లింపులు స్వీకరించబడవు' అంటూ నోటీసులు అంటిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు పైబడిన ఎంపిక చేసిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయమే ఈ ఆందోళనకు కారణం.

వ్యాపారులు ఈ అదనపు భారాన్ని మోయడానికి సిద్ధంగా లేరు. ఈ ఛార్జీలను ప్రభుత్వం వ్యాపారుల నుంచే వసూలు చేస్తుందని చెప్పినప్పటికీ, ఇది పరోక్షంగా వినియోగదారులపైనే ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే, అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొనుగోళ్లకు నగదు తీసుకురావాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. ఈ కొత్త ఛార్జీల భారాన్ని తాము భరించలేమని, అందుకే పెద్ద మొత్తంలో చెల్లింపులకు నగదు అడగాల్సి వస్తుందని వారు చెబుతున్నారు.

**అక్టోబర్ 15 నుంచి ఏం మారుతుంది?**

కొత్త నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 15 నుంచి




వినియోగదారుడి నుంచి వ్యాపారికి (పర్సన్-టు-మర్చంట్) చేసే రూ.2,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఈ ఛార్జీని కస్టమర్ కాకుండా, సదరు వ్యాపారి చెల్లించాల్సి ఉంటుంది. లావాదేవీ విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, ఈ ఛార్జీ గరిష్ఠంగా రూ.300గా పరిమితం చేశారు.

అయితే, వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు, అలాగే రూ.2,000 లోపు చేసే వ్యాపార చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. ప్రస్తుతం జరుగుతున్న 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలలో 95 శాతానికి పైగా రూ.2,000 లోపువే కాబట్టి, వాటిపై ఈ కొత్త నిబంధన ప్రభావం ఉండదు. అంటే, దుకాణంలో రూ.1,500 వస్తువును యూపీఐ ద్వారా కొంటే ఎలాంటి అదనపు రుసుము ఉండదు. అధిక విలువైన లావాదేవీలకే ఈ మార్పు వర్తిస్తుంది.

**ప్రభుత్వం ఏమంటోంది?**

ఈ ఛార్జీల భారాన్ని పూర్తిగా వ్యాపారులే భరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఒకవేళ వ్యాపారులు బిల్లులపై 'యూపీఐ ఛార్జీ' అని ప్రత్యేకంగా వేయడం ప్రారంభిస్తే, యూపీఐ ఇక ఉచితం కాదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఇది డిజిటల్ చెల్లింపుల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. అందుకే, ఈ భారం వినియోగదారులపై పడకుండా చూసేందుకు పేమెంట్ అగ్రిగేటర్లు, బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

**ప్రజలు తిరిగి నగదు వైపు వెళ్తారా?**

ఈ కొత్త ఛార్జీల వల్ల ప్రజలు మళ్లీ నగదు వాడకం వైపు మళ్లుతారని ప్రభుత్వం భావించడం లేదు. మొత్తం యూపీఐ లావాదేవీల పరిమాణంలో కేవలం 4 శాతం మాత్రమే ఈ కొత్త లెవీ పరిధిలోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్‌పీసీఐ గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో జరిగిన పీ2ఎం యూపీఐ లావాదేవీల్లో 86 శాతం రూ.500 లోపువే కాగా, మరో 10 శాతం రూ.501 నుంచి రూ.2,000 మధ్య ఉన్నాయి.

కాబట్టి సామాన్య ప్రజల రోజువారీ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదు. మరోవైపు, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై లావాదేవీ విలువతో సంబంధం లేకుండా ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టం చేశారు. ఇది వ్యాపారులకు, వినియోగదారులకు మరో డిజిటల్ చెల్లింపు మార్గంగా అందుబాటులో ఉంటుంది.

# ఎకరం ఎండినా సీఎందే బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

కాల్వలల్లోని నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్మెన్ కరుణశ్రీ సాయి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డితో కలిసి మాట్లాడారు. ఎల్ నినో పేరుతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, పంటలకు సాగునీరు ఇవ్వకపోవడమే కాకుండా విద్యుత్ కోతలతోనూ పంటలు ఎండిపోతున్నాయన్నారు. జూరాల డ్యామ్ లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ కు ఎగువ ఉన్న పోతిరెడ్డిపాడు వెలిగొండ ప్రాజెక్టులకు 100 టీఎంసీల నీరు విడుదల చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం సాగుకు కృష్ణా జలాలను పాలమూరు రైతులకు ఇవ్వలేకపోతుందన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి నీటిని జూరాలకు తరలించవచ్చు కదా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఆల్మట్టి నారాయణపూర్ ప్రాజెక్టుల వద్ద ఐదు మీటర్ల ఎత్తు పెంచడానికి కర్నాటక ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనేక రిజర్వాయర్లకు సాగునీరు అందించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ను రూ.84 వేల కోట్లతో 40 టీఎంసీల నీటి కోసం కేసీఆర్ నిర్మిస్తే దానికి రేవంత్‌రెడ్డి కాకిగోల చేస్తున్నారని విమర్శించారు. కింద ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాగునీరు పోతుంది, కానీ పైన ఉన్న తెలంగాణకు నీళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇది కేవలం గురువు మీద ఉన్న ప్రేమతోనే రేవంత్ రెడ్డి ప్రశ్నించడం లేదని విమర్శించారు. అత్యల్పంగా కృష్ణా నీటిని వినియోగించుకున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డిదే అని అన్నారు. కల్వకుర్తి లిఫ్టులను కొనసాగించకుండా రైతులకు సాగునీరు అందించకుండా ప్రభుత్వమే ఇబ్బందులు పెడుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంటు సరఫరా చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం 6 గంటలు కూడా సరఫరా చేయడం లేదన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. తొలి వికెట్ దానం నాగేందర్ అని, మిగతా వారిని కూడా తొందర్లోనే పడగొడతామన్నారు. పార్టీ ఫిరాయించిన వారందరూ రాజీనామా చేసి గెలవాలన్నారు. మళ్లీ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని, ప్రజల కష్టాలన్నీ తీరుస్తుందని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, పెబ్బేరు మండల పట్టణ పార్టీ అధ్యక్షులు వనం రాములు, దిలీప్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు కరుణశ్రీ, హరి శంకర్ నాయుడు, సౌజన్య, మన్యం, పార్టీ నాయకులు కర్రే స్వామి, పెద్దింటి వెంకటేష్, సాయి, విశ్వరూపం తదితరులు పాల్గొన్నారు. +వశీస్త్రతీఖుజూష్త్రఅఎ =వటవతీవఅవెవ

**ఎకరం ఎండినా సీఎందే బాధ్యత**

రైతాంగం సాగు చేసిన పంటలకు నీళ్లు ఇవ్వడం లేదనీ, ఎకరం ఎండినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత అని కేటీఆర్ హెచ్చరించారు. శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం గుమ్మడం, పెబ్బేరు సబ్ స్టేషన్లు పరిశీలించారు. పెబ్బేరు సబ్ స్టేషన్ నుంచి సుభాష్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున రైతులతో ర్యాలీగా వచ్చారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ పర్యటన కొనసాగింది. పెబ్బేరులో పెద్ద ఎత్తున తరలివచ్చిన రైతులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. రైతులకు 24 గంటల పాటు కరెంటు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కేవలం ఆరు గంటలు మాత్రమే ఇచ్చి దగా చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సొంత గ్రామంలోని రైతులే ఆందోళన చేస్తున్నారని దానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎల్‌నినో ప్రభావం అని చెప్పడం సిగ్గుచేటన్నారు. పాలమూరు ముఖ్యమంత్రిని ప్రజలు తీసుకొస్తే ఆయన పాలమూరు రైతుల నోట్లో మట్టి కొట్టారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ నాయకులు గట్టు యాదవ్, మండల, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# యువతే తెలంగాణకు అతిపెద్ద బలం

**మొదటిపేజీ తరువాయి**

కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని వివరించారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో శనివారం డిప్యూటీ సీఎం ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రంరాష్ట్రాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు వనరులను సమర్థంగా సమీకరించడంతో పాటు బలమైన సంస్థలు, పరస్పర సహకార విధానాలు అవసరమన్ని తెలిపారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని తెలిపారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

**మొదటిపేజీ తరువాయి**

'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.విమానాశ్రయ నిర్మాణ పనులను ఏఏఐ మూడు ప్యాకేజీలుగా చేపడుతోంది. మొదటి ప్యాకేజీలో 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రన్‌వే, పార్కింగ్, డ్రైనేజీ వ్యవస్థల పనులు ఉంటాయి. మూడో ప్యాకేజీలో భాగంగా రూ. 213.59 కోట్ల అంచనా వ్యయంతో టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, పవర్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటికి సంబంధించిన టెండర్లను నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డిసెంబర్‌లో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

**మొదటిపేజీ తరువాయి**

సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు.ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐ+ూ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

# భారతీయులకు పెరిగిన వీసా టెన్షన్

**మొదటిపేజీ తరువాయి**

నుంచి వచ్చే దరఖాస్తులు తగ్గినట్లు తాజా సర్వే వెల్లడించింది. వీసాల జారీ ఆలస్యం, వీసా తిరస్కరణలు, కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ పరిణామాలతో ముఖ్యంగా భారత్, చైనా నుంచి అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోంది.

అమెరికన్ కౌన్సిల్ ఆన్ ఎడ్యుకేషన్ (ఏసీఈ) 328 మంది ఉన్నత విద్యా సంస్థల సీనియర్ అధికారులతో ఈ సర్వే నిర్వహించింది. ఇందులో 63 శాతం మంది ఇమ్మిగ్రేషన్ ఆంక్షలు, వీసాల రద్దుపై తీవ్రంగా లేదా కొంతమేర ఆందోళన ఉన్నట్లు చెప్పారు. అంతేకాదు.. 36 శాతం మంది ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు తమ యూనివర్సిటీలు సిద్ధంగా లేవని తెలిపారు.

అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య తగ్గడం అమెరికా యూనివర్సిటీల అడ్మిషన్లపైనే కాదు.. వాటి ఆర్థిక పరిస్థితిపైనా ప్రభావం చూపుతుంది. విదేశీ విద్యార్థులను చేర్చుకునే యూనివర్సిటీల అధ్యక్షుల్లో 73 శాతం మంది.. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో తమ ఆదాయం కూడా తగ్గిందని తెలిపారు.

దీని ప్రభావం ఇప్పటికే కొన్ని క్యాంపస్‌లలో కనిపిస్తోంది. 23 శాతం మంది అధికారులు పరిశోధనలు, విద్యార్థుల సహాయ కార్యక్రమాలకు కేటాయించే బడ్జెట్‌ను తగ్గించినట్లు చెప్పారు. 9 శాతం మంది కొన్ని కోర్సులను మూసివేయడం లేదా ఇతర కోర్సులతో విలీనం చేయాల్సి వచ్చిందన్నారు. మరో 11 శాతం మంది విద్యార్థులకు ఇచ్చే ఆర్థిక సాయం తగ్గినట్లు వెల్లడించారు.

అమెరికా యూనివర్సిటీలో సీటు రావడం ఒక్కటే ఇప్పుడు సరిపోదు. అడ్మిషన్ వచ్చిన తర్వాత వీసా ఎప్పుడు వస్తుంది? ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో ఏమైనా మార్పులు వస్తాయా? అనే అంశాలు కూడా విద్యార్థులకు కీలకంగా మారాయి.వీసా ప్రక్రియ ఆలస్యమైతే, నిర్ణయించిన సమయానికి విద్యార్థులు అమెరికా వెళ్లి తరగతులకు హాజరుకావడం కష్టమవుతుంది. అదే సమయంలో వీసాలపై అనిశ్చితి కొనసాగితే యూనివర్సిటీలు కూడా విదేశీ విద్యార్థుల సంఖ్యను అంచనా వేయడం కష్టమవుతుంది.

ఇప్పటికే అమెరికా యూనివర్సిటీల్లో దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం ప్రధాన ఆందోళనగా మారింది. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థుల దరఖాస్తులు, అడ్మిషన్లు తగ్గడం అక్కడి విద్యా సంస్థలకు మరో సవాలుగా మారుతోంది.

# అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం

**మొదటిపేజీ తరువాయి**

ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది.మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

# విద్యార్థులకు నాణ్యమైన సామాగ్రి ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నతాధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓజా, సైదులు, సంతోష్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన వస్తువుల పంపిణీ వివరాలను అధికారులు సీఎంకు నివేదించారు. విద్యార్థులకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందనీ, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేశామన్నారు.విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందని చెప్పారు. ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. ఆయా వివరాల పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తక్షణం ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాల ప్రకారం పనిచేసిన అధికారుల్ని అభినందించారు.

# జపాన్‌లో 20వ ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

కోసం పోటీ పడనున్నారు.ఈ చారిత్రాత్మక ఈవెంట్ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశ క్రీడా బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. "ఐచీ-నగోయాలో ఆసియా క్రీడలు ప్రారంభమవుతున్న వేళ, భారత బృందానికి నా శుభాకాంక్షలు. ప్రతి క్రీడాకారుడు అద్భుతమైన కృషి, అంకితభావం, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. వారిని చూసి భారతదేశం గర్విస్తోంది. వారు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలి, బాగా ఆడాలి, ప్రకాశించాలి!" అని ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.

ప్రారంభోత్సవ వేడుక భారత్‌కు ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఒలింపిక్ పతక విజేత, షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్ భారత బృందానికి పతాకధారులుగా ముందుండి నడిపించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని స్టేడియంలోకి అడుగుపెట్టిన వీరిపై దేశం భారీ అంచనాలు పెట్టుకుంది. 2023లో హాంగ్‌జౌలో జరిగిన గత ఆసియా క్రీడల్లో 28 స్వర్ణాలతో సహా మొత్తం 107 పతకాలు సాధించి భారత్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆ రికార్డును అధిగమించాలనే లక్ష్యంతో భారత బృందం బరిలోకి దిగుతోంది.ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి. గతంలో 1958లో టోక్యోలో, 1994లో హిరోషిమాలో ఈ పోటీలు జరిగాయి. ఈసారి 45 దేశాలకు చెందిన క్రీడాకారులు 43 క్రీడాంశాల్లో తలపడనున్నారు.ఈ పోటీల్లో భారత్ పలు క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. పురుషుల, మహిళల క్రికెట్, కబడ్డీ జట్లతో పాటు, పురుషుల హాకీ జట్టు కూడా తమ టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తోంది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను భారత ప్రచారానికి నాయకత్వం వహించనున్నారు. షూటింగ్‌లో మను భాకర్, రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహెన్ వంటి ప్రముఖులు పతకాలపై కన్నేశారు. అథ్లెటిక్స్‌లో 75 మందికి పైగా భారత క్రీడాకారులు బరిలో ఉన్నారు. గుల్వీర్ సింగ్, తేజస్విన్ శంకర్, జ్యోతి యర్రాజీ, పారుల్ చౌదరి వంటి అథ్లెట్లు తమ సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, ఈసారి కూడా ఫేవరెట్‌గా పోటీ పడుతున్నాడు.

# బైక్ బజార్ల దోపిడీ..
# వినియోగదారుల విలవిల..

**నాసిరకం రిపేర్లు.. పాత బైక్‌లకు కొత్త రంగులు..**

**అధిక వడ్డీ ఫైనాన్స్‌తో నిలువు దోపిడీ ఆరోపణలు..**

**ఈఎంఐ ఆలస్యమైతే బెదిరింపులు.. రోడ్డుపైనే సీజింగ్ హంగామా..**

**సెటిల్మెంట్ పేరుతో వాహనం తీసుకుని తక్కువ మొత్తానికి మోసం చేస్తున్నారన్న ఆరోపణలు..**




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
ఎల్బీనగర్ పరిధిలో కొన్ని బైక్ బజార్లు, వాటికి అనుబంధంగా పనిచేస్తున్న ఫైనాన్స్ వ్యవహారాలపై వినియోగదారుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత ద్విచక్ర వాహనాలను నాసిరకంగా మరమ్మతులు చేసి,బయటకు కొత్తవాటిలా కనిపించేలా చేసి విక్రయించడమే లక్ష్యంగా కొన్ని వ్యాపారాలు సాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
వాహనం కొనుగోలు చేసేందుకు వచ్చే సామాన్యులను లక్ష్యంగా చేసుకుని అధిక వడ్డీతో ఫైనాన్స్ చేసి ఆర్థికంగా భారాన్ని మోపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.ఒకటి, రెండు ఈఎంఐలు ఆలస్యమైనా ఫైనాన్స్ సిబ్బంది పేరుతో కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని,దాడులకు దిగుతున్నారని, వాహనాలను బలవంతంగా తీసుకెళ్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

### రోడ్డుపైనే 'సీజింగ్' హంగామా.?

వాహనం సీజ్ చేయాలనే పేరుతో ఐదు నుంచి పది మంది వరకు వ్యక్తులు రోడ్లపై గుంపుగా నిలబడి వాహనదారులను అడ్డుకుని, రౌడీలవలె వ్యవహరిస్తూ దౌర్జన్యంగా వాహనాలను లాక్కెళ్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని చెబుతున్నారు. చట్టబద్ధమైన రికవరీ ప్రక్రియకు బదులుగా రోడ్డుపైనే దౌర్జన్యం చేసి బలవంతపు సీజింగ్ చేయడం ఎంతవరకు సమంజసమన్న వినియోగదారుల నుండి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### 'సెటిల్మెంట్' పేరుతో మరో దోపిడీ.?

ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితుల్లో వినియోగదారులతో సెటిల్మెంట్ పేరుతో వాహనాలను తీసుకుని,వాటి విలువకు పూర్తిగా తగిన మొత్తాన్ని చెల్లించకుండా తక్కువ డబ్బుతో వ్యవహారం ముగిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వాహనం మార్కెట్ విలువ, ఇప్పటికే చెల్లించిన ఈఎంఐలు, బకాయిల వివరాలను పారదర్శకంగా చూపకుండా వినియోగదారులను ఒత్తిడికి గురిచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.
సామాన్యుల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వాహన విక్రయాలు, ఫైనాన్స్,సీజింగ్ పేరుతో ఎవరైనా అక్రమాలకు పాల్పడుతున్నారా అనే అంశంపై అధికారులు సమగ్రంగా విచారణ




చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.
ఎల్బీనగర్‌లోని బైక్ బజార్లు, అనుబంధ ఫైనాన్స్ సంస్థలపై రవాణా,పోలీస్, వినియోగదారుల పరిరక్షణ, సంబంధిత నియంత్రణ సంస్థలు దృష్టి సారించాలి. నాసిరకం వాహనాల విక్రయాలు, అధిక వడ్డీ, బెదిరింపులు, దౌర్జన్యపు సీజింగ్ వంటి ఆరోపణలు పై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

## ఆరోగ్య మిత్రలకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కల్పించాలి



**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):**
ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు ఐదువేల రూపాయలు ట్రాన్స్పోర్ట్ అలవెన్స్ కల్పించాలని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జండగి హనుమంత్ కొండిబా ఐఏఎస్ ను లకిడికాపూల్ లోని ఆరోగ్యశ్రీ కేంద్ర కార్యాలయం ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ తప్పనిసరిగా ఉద్యోగులకు న్యాయం చేస్తామని, ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. అందుకు రాష్ట్ర ఆరోగ్యశ్రీ ఉద్యోగుల పక్షాన సీఈఓకు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు
## కేంద్ర మంత్రికి వినతి పత్రం



**అంబర్ పేట్, (ప్రజావినికిడి):** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మాజీమంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని అంబర్ పేటలో ప్రతిష్టించేందుకు సహకారం అందించాలని కోరుతూ అంబర్ పేట పద్మశాలి సంఘం నాయకులు శనివారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణా నేతృత్వంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడిమర్రి హరి, ప్రధాన కార్యదర్శి చిలక శివ్ కుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్, ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య,పి. మధుసూదన్, అంజాల విజయ్ కుమార్, సలహాదారులు డాక్టర్ మార్త రమేష్,చిలువేరు యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు గందెమల్లి శ్రీనివాస్,తీగల నరేందర్,నాగుల రాజేందర్,ప్రచార కార్యదర్శి వనం రమణ,డివిజన్ అధ్యక్షులు గంగిశెట్టి సత్తయ్య, సాయిని మూర్తి, ఎస్.నర్సింగ్ రావు,కోట వెంకటేష్,పటేల్ నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి రాజు, మహిళా ప్రతినిధి బిల్లా దీపిక తదితరులు వినతప్రత్రం అందజేసిన వారిలో ఉన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి తప్పనిసరిగా తన వంతు సహకారం అందజేస్తానని చెప్పారు.

## పేదలకు వంద గజాల స్థలం ఇవ్వాలి
### కడారి నాగేశ్వర్ రావు



**అబిడ్స్, (ప్రజావినికిడి):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల డిక్లరేషన్ లో సీఎం రేవంత్ రెడ్డి పేదలకు వంద గజాల స్థలాన్ని ఇస్తామని చెప్పి మోసగించారు. ఈ మేరకు పేదలకు వంద గజాల స్థలం ఇవ్వాలని అక్టోబర్ 30న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద దీక్ష ను చేపట్టనున్నట్టు తెలంగాణ కార్మిక సమైక్య జనరల్ సెక్రటరీ కడారి నాగేశ్వర్ రావు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ కార్మిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు కలకోటి రామన్న, రాష్ట్ర అధ్యక్షురాలు నెమలిపురి నాగమణి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. "చలో హైదరాబాద్ పేదలకు వంద గజాల స్థలం కోసం దీక్ష' అనే కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల హామీలో రేవంత్ రెడ్డి మా పార్టీ అధికారంలోకి వస్తే కార్మికులకు, అసంఘటిత కార్మికులకు వంద గజాల స్గలం ఇస్తానని చెప్పి నేడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం అసంఘిటిత కార్మికులకు మోసం చేసింది అంటే నేడు ఈ ప్రభుత్వం కూడా అదే బాటలో పోవడం విడ్డూరంగా మారిందన్నారు. ప్రతి కార్మికులకు, సంఘటిత, అసంఘటిత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వంద గజాల స్థలం ఇస్తూ ఇందిరమ్మ ఇల్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు.అంతే కాకుండా ప్రభుత్వం ప్రతి పేదవారికి 3 ఎకరాలు సాగు భూమి ఇవ్వాలన్నారు. ఉచితంగా విద్య,వైద్యం, మహిళలకు భద్రత కల్పించాలి. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసే కార్మికులకు, పారశుద్ధ్య కార్మికులకు, గ్రామ పంచాయతీ కార్మికులకు పర్మినెంట్ చేయాలి.లేదా కనీస వేతనం 30 నుండి 50వేలు ఇవ్వాలి.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా అంబేద్కర్ అభయ హస్తం కింద 12లక్షలు ఇవ్వాలని కోరారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బి కేర్ ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి 294 డివిజన్ జయంత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి..ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ సర్పంచ్ కావలి గణేష్, ఏఆర్ సాధు యాదవ్,కుమార్ యాదవ్,వేణు కుమార్ దుడ్డు రాహుల్ చంద్రయ్య గుప్తా, నరసింహారెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# పాదచారులకు దారేది.?

**ఆక్రమణల చెరలో ఫుట్‌పాత్‌లు..**

**పార్కింగ్‌తో మరింత ఇబ్బంది.. వ్యాపార అవసరాలకు పాదచారుల మార్గాల వినియోగం..**

**సామాజిక విశ్లేషకులు శ్రీనివాస్..**

**ఎల్బీనగర్,సెప్టెంబర్ 19,(ప్రజావినికిడి):**
నగరంలో రహదారులు రోజురోజుకూ రద్దీగా మారుతున్నాయి. వాహనాల సంఖ్య పెరుగుతోంది.. వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.. కొత్త నిర్మాణాలు వెలుస్తున్నాయి. కానీ ఈ అభివృద్ధి మధ్య పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్‌లు మాత్రం క్రమంగా కనుమరుగవుతున్నాయి.ఎక్కడ చూసినా దుకాణాల ముందు వస్తువులు, బోర్డులు,చిరు వ్యాపారాల సామగ్రి, ద్విచక్ర వాహనాలు,కార్ల పార్కింగ్‌తో నడిచేందుకు స్థలం లేకుండా పోతోంది.
రోడ్డుపై వాహనాలు.. ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు.. మధ్యలో ఇరుకైన దారిలో పాదచారుల ప్రయాణం..ఇదీ ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్న దృశ్యం. ముఖ్యంగా ప్రధాన రహదారులు, మార్కెట్లు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల పరిసరాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది.

### ఫుట్‌పాత్ ఉన్నా..నడకకు చోటేది?

పాదచారుల సౌకర్యం కోసం రహదారుల వెంట ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేస్తారు.అయితే అనేక ప్రాంతాల్లో వాటి అసలు ఉద్దేశమే పక్కదారి పడుతోంది.కొన్ని చోట్ల దుకాణాల ముందు సరుకులు పెట్టేందుకు, మరికొన్ని చోట్ల వాహనాలను నిలిపేందుకు ఫుట్‌పాత్‌లను ఉపయోగిస్తున్నారు.దీంతో పాదచారులు రోడ్డుపైకి వచ్చి నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.
రోడ్డుపై నడుస్తున్న సమయంలో వాహనాలు వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదం పొంచి ఉంటుంది. చిన్నారులు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఈ సమస్యతో మరింత ఇబ్బంది పడుతున్నారు.

### వ్యాపారం కోసం.. పాదచారుల దారి ఎందుకు?

వాణిజ్య ప్రాంతాల్లో దుకాణాల ముందు ఫుట్‌పాత్‌లను వ్యాపార అవసరాలకు ఉపయోగించడం సాధారణ దృశ్యంగా మారుతోంది. దుకాణాల్లో స్థలం సరిపోకపోవడంతో వస్తువులను బయట ప్రదర్శించడం, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయడం, సరుకులను దింపడం, కస్టమర్ల వాహనాలను నిలిపేందుకు స్థలం కల్పించడం వంటి కారణాలతో పాదచారుల మార్గం ఆక్రమణకు గురవుతోంది.
వ్యాపారులకు తమ అవసరాలు ఎంత ముఖ్యమో.. పాదచారులకు సురక్షితంగా నడిచే హక్కు కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రజల రాకపోకలకు ఉద్దేశించిన స్థలాన్ని పూర్తిగా వ్యాపార



వినియోగానికి మార్చడం వల్ల చివరకు రోడ్డుపైనే నడిచే పరిస్థితి ఏర్పడుతోంది.

### పార్కింగ్‌కు స్థలం లేక..ఫుట్‌పాత్‌పై వాహనాలు

పార్కింగ్ సమస్య మరో ప్రధాన కారణంగా మారింది. వాణిజ్య ప్రాంతాల్లో సరిపడా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌లపై వాహనాలను నిలుపుతున్నారుకొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలు వరుసగా నిలిపేయడంతో ఫుట్‌పాత్ పూర్తిగా మూసుకుపోతోంది.
కార్లను ఫుట్‌పాత్‌పైకి ఎక్కించి పార్కింగ్ చేయడం వల్ల పాదచారులు రోడ్డుపైకి రావాల్సి వస్తోంది.దీంతో ట్రాఫిక్ రద్దీతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోంది.

### ఆసుపత్రులు, మార్కెట్ల వద్ద మరింత సమస్య

ఆసుపత్రులు, మార్కెట్లు, హోటళ్లు,షాపింగ్ ప్రాంతాల వద్ద పాదచారుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు అందుబాటులో లేకపోతే ప్రజలు తప్పనిసరిగా రోడ్డుపైనే నడవాల్సి వస్తుంది.
ఆసుపత్రులకు వచ్చే వృద్ధులు, రోగులు, సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్లలో కొనుగోళ్ల కోసం వచ్చే ప్రజలు వాహనాల మధ్య నుంచి నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రద్దీ సమయాల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది.

### దివ్యాంగులకు మరింత కష్టం

ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికావడం వల్ల దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వీల్‌చైర్‌లు, వాకింగ్ స్టిక్స్ ఉపయోగించే వారికి సమతలంగా, అడ్డంకులు లేని మార్గం అవసరం. కానీ అనేక చోట్ల ఫుట్‌పాత్‌లు ఎత్తుపల్లాలతో ఉండటం, వాహనాలు నిలపడం, సామగ్రి పెట్టడం వంటి కారణాలతో వారికి రాకపోకలు కష్టంగా మారుతున్నాయి.
పాదచారుల సౌకర్యం అంటే కేవలం నడిచేందుకు స్థలం కల్పించడం మాత్రమే కాదు. అన్ని వయసుల వారు,అన్ని సామర్థ్యాలు కలిగిన వారు సురక్షితంగా ఉపయోగించుకునేలా మార్గాలను ఏర్పాటు చేయడం కూడా అవసరం.

### ఆక్రమణలు తొలగిస్తేనే సమస్య పరిష్కారం కాదు

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించడం అవసరమే. అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే నిరంతర పర్యవేక్షణ కూడా ఉండాలి.ఒకసారి ఆక్రమణ తొలగించిన తర్వాత మళ్లీ అదే పరిస్థితి ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.
వ్యాపారులు కూడా ఫుట్‌పాత్‌లను తమ దుకాణాల విస్తరణగా కాకుండా ప్రజల నడక మార్గంగా చూడాలి. వాహనదారులు పార్కింగ్ నిబంధనలను పాటించాలి. ప్రజలు కూడా ఫుట్‌పాత్‌లను అందుబాటులో ఉంచే విషయంలో సహకరించాలి.

### ఎలా పరిష్కరించాలి?

ఫుట్‌పాత్‌లను పూర్తిగా పాదచారుల వినియోగానికే కేటాయించాలి.
ఆక్రమణలను క్రమం తప్పకుండా తొలగించాలి.
ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి.
దుకాణాల ముందు సరుకులు, ప్రకటన బోర్డులు పెట్టకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలి.
పాదచారుల మార్గాల్లో ద్విచక్ర వాహనాలు,కార్ల పార్కింగ్‌ను అరికట్టాలి.
పాఠశాలలు, ఆసుపత్రులు, మార్కెట్ల వద్ద పాదచారుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
దివ్యాంగుల కోసం అడ్డంకులు లేని ఫుట్‌పాత్‌లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలి.
రహదారి అభివృద్ధి పనుల్లో పాదచారుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
ప్రజలు, వ్యాపారులు, వాహనదారుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

### రోడ్లు వాహనాలకేనా?

నగరం అభివృద్ధి చెందాలంటే రహదారులు వాహనాల రాకపోకలకు మాత్రమే కాకుండా పాదచారులకు కూడా సురక్షితంగా ఉండాలి. వాహనదారులకు రహదారి ఎంత అవసరమో.. పాదచారులకు ఫుట్‌పాత్ అంతే అవసరం. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురైతే సమస్య కేవలం నడకకు సంబంధించినది కాదు..అది భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా హక్కులకు సంబంధించిన అంశంగా మారుతుంది. "ఫుట్‌పాత్ ఖాళీగా ఉంటేనే నగర రహదారి పూర్తవుతుంది. పాదచారులకు దారి ఇవ్వడం అంటే నగరానికి భద్రత కల్పించడమే."
అందుకే నగరాభివృద్ధిలో పాదచారుల కోసం ప్రత్యేక ప్రణాళిక అవసరం. వ్యాపారం అభివృద్ధి చెందాలి.. వాహనాలకు పార్కింగ్ ఉండాలి..కానీ వాటి కోసం పాదచారుల దారిని మూసివేయకూడదు.ప్రజల నడకకు దారి మిగిలినప్పుడే నగర అభివృద్ధి సమగ్రంగా ఉన్నట్టవుతుంది.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి..

## వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి.. -డా.పుట్ల శ్రీనివాస్..





**హైదరాబాద్, (ప్రజావినికిడి):** ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

గోల్కొండ క్లస్టర్ పరిధిలోని ఫిలింనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డా. పుట్ల శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ల్యాబొరేటరీ కేంద్రం,వివిధ రికార్డులు, ఆరోగ్య కేంద్రంలోని పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు.

అనంతరం గర్భిణీల సంరక్షణ, శిశువులకు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గునియా వంటి వ్యాధుల నియంత్రణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంటువ్యాధుల సర్వే,స్క్రీనింగ్, ఫాలోఅప్ కార్యక్రమాలను ప్రతిరోజూ నిర్వహించాలని, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.సాయిబాబా, గోల్కొండ క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా. మురళీధర్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వర్ష కాలం లెకపోవడంతో రైతులు ఆందోళన..

### మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రాష్ట్రంలో వర్షకాలం సరిగా లేక అన్ని వర్గాల రైతులు తీవ్ర స్థాయిలో నష్టపోతున్నారని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.ఇటీవల దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా రైతులు తమ పంటలను నష్టపోయారని, ఆర్థికంగా తీవ్ర నష్టానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ యేడు సరైన సమయంలో వర్షాలు పడక, పంటలకు సరిపడా నీళు లేక ఇప్పటికీ సుమారు 80% మేరా పంటలు ఎండిపోతున్నాయని,భూగర్భ జలాలు మరింత అడుగంటుతే వరి పంట కూడా పండే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు.ఎల్ నినో పరిస్థితి నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అండగా నిలవవలసిన అవసరం ఉందని,వారిని అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో పంటల సాగుపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పంటల నష్టం పై అంచనా వేసి రైతులకు తగిన ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.పంట బీమా తక్షణ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.అన్ని ప్రాంతాలలో మొక్కజొన్న పంట పూర్తిగా ఎండిపోయిందని, వర్షంపై ఆధారపడి పంటలు స్థాయిలో సాగు కాలేదని చెప్పారు. రానున్న యాసంగి పంటలకైనా విత్తనాలు, ఎరువులు పెద్ద మొత్తంలో రైతులకు అందించాలని కోరారు.ఎలినో ప్రభావం ఎదుర్కొనే విధంగా రైతులకు సలహాలు సూచనలు చేసి వాతావరణానికి అనుకూలంగా పంటలు వేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు.ప్రతి పంటకు మద్దతు ధర వచ్చే విధంగా,సకాలంలో పంటకు తగిన డబ్బులు అదే విధంగా ప్రభుత్వాలు చొరవ చూపాలని సూచించారు.రైతు బంధు నిధులను సైతం సకాలంలో విడుదల చేసి రైతుకు అండగా ఉండాలని ఆకాంక్షించారు.


# శ్రీ సాయి గణేశ్ టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం



**సరూర్ నగర్, సెప్టెంబర్ 19,(ప్రజావినికిడి):** కోదండరాం నగర్‌లో శ్రీ సాయి గణేశ్ టీమ్ ఆధ్వర్యంలో దేవరకొండ సుదర్శన్ పటేల్, స్వప్న పటేల్ దంపతుల సమక్షంలో శనివారం సాయంత్రం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సరూర్‌నగర్ ఏఎస్పై కృష్ణ, తెలంగాణ హైకోర్టు అసిస్టెంట్ కమాండెంట్ భాస్కర్, జర్నలిస్ట్ సానెం శ్రీనివాస్ గౌడ్,సానెం మమత గౌడ్, లంక లక్ష్మీ నారాయణ, కందికంటి విశాల్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కోదండరాం నగర్‌లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్యక్రమంలో ధనుష్ పటేల్, రేషా పటేల్, సిద్ధార్థ్ పటేల్ తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.



# డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** షాద్ నగర్ పట్టణంలోనీ ఆర్టీఒ కార్యాలయం లో షాద్ నగర్ మాజీ చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తన డ్రైవింగ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకున్నారు.అనంతరం కార్యాలయం ఆవరణలో ఆవరణలో మొక్కలను నాటారు,ఈ సందర్భంగా సంబంధిత అధికారుల సమక్షంలో లైసెన్స్ రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ టీ వో అధికారి స్వప్న,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,కౌన్సిలర్ పెంటయ్య, మురళీమోహన్, కొప్పునూరి ప్రవీణ్,బచ్చలి నరేష్,మాజీ కౌన్సిలర్ చేగురి రాజేందర్,సర్వర్ పాషా,మాజీ ఎంపీటీసీ కట్ట వెంకటేష్ గౌడ్,జంగారి రవి, ప్రదీప్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రుల పూజ కార్యక్రమాలు..

### అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న కొలుకుల జైహింద్..




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధి జగద్గిరిగుట్ట డివిజన్ లో ఆరవ రోజు గణేష్ నవరాత్రుల సందర్భంగా యువ నాయకులు కొలుకుల జైహింద్ శనివారం సంజయ్ పూరి కాలనీ,పొలాల బస్తీ,న్యూ రాజీవ్ గాంధీ నగర్, భూదేవి హిల్స్, బస్తీలలో గణనాథుని కి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలంతా గణనాథుని ఆశీస్సులతో విఘ్నాలన్ని తొలగిపోయి సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించారు. ప్రజలందరికీ గణేష్ నవరాత్రి ఉత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్ కుమార్,విట్టల్ గౌడ్,రాయి విగ్నేష్,విట్టల్ ముదిరాజ్, సాయిలు యాదవ్,మధు, కిషోర్,మల్లా చారి,వెంకటేష్, ఎర్ర లక్ష్మయ్య, అంజయ్య యాదవ్, తిరుపతిరావు, హనుమంతు యాదవ్, యాదగిరి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా'డ్రీమ్‌ఫోర్స్ 2026'సదస్సు,

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):**
సాన్ ఫ్రాన్సిస్కో నగరంలో సెప్టెంబర్ 15 నుంచి 17 వరకు 'డ్రీమ్‌ఫోర్స్ 2026'సదస్సు ను ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో మానవులు,ఏఐ ఏజెంట్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. మానవులకు కేవలం సహాయం చేసే ఏఐ నుంచి, ఇకపై స్వయంగా నేరుగా పనిచేసి పనులను పూర్తి చేయగలిగే కొత్త తరహా సంస్థలుగా ప్రతి వ్యాపారం మారాలని ఈ సదస్సు స్పష్టం చేసింది.కస్టమర్ల అనుభవాన్ని మరింత మెరుగుపరచడం,ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడం, వ్యాపార వృద్ధిని వేగవంతం చేయడం వంటి అంశాల్లో మానవులతో కలిసి పనిచేసే ఏఐ ఏజెంట్లతో ఏజెంటిక్ సంస్థలను రూపొందించడమే సేల్స్‌ఫోర్స్ ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.

ఈ డ్రీమ్‌ఫోర్స్ సదస్సులో భాగంగా, సేల్స్‌ఫోర్స్ దక్షిణాసియా అధ్యక్షురాలు మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అరుంధతి భట్టాచార్య మాట్లాడుతూ, "సంస్థల టెక్నాలజీ ఏ దిశగా వెళ్తుందో డ్రీమ్‌ఫోర్స్ సదస్సు స్పష్టంగా చూపిస్తోందన్నారు.ముఖ్యంగా భారతదేశానికి ఇది ఒక కీలకమైన సమయం అని భారతీయ సంస్థలు ఏఐని కేవలం ప్రయోగాత్మకంగా ఉపయోగించడం దాటి,కస్టమర్లకు సేవలు అందించడం, ఉద్యోగులను మరింత శక్తివంతం చేయడం,వృద్ధిని పెంచడం వంటి ప్రతి అంశంలో ఏఐ ఏజెంట్లను వేగంగా ఉపయోగించుకుంటున్నాయన్నారు.సంస్థల రోజువారీ పనుల్లో, కంప్యూటర్ వ్యవస్థల్లో ఏఐ ఒక భాగంగా మారడం ఒక ప్రాథమికమైన మార్పును సూచిస్తోందన్నారు. విశ్వసనీయమైన వ్యాపార ఫలితాలను అందించేలా ఏఐ సామర్థ్యాన్ని ఎంత సమర్థవంతంగా ఉపయోగించగలమనే దానిపైనే ఇకపై ఈ టెక్నాలజీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు.

# చేగూర్‌లో వినాయక మండపాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**నందిగామ,(ప్రజావినికిడి):** మండలంలోని చేగూర్ గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయా మండపాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారువినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో ప్రశాంతత,ఐక్యత వెల్లివిరియాలని అంజయ్య యాదవ్ ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,స్థానిక నాయకులు అంజయ్య యాదవ్‌కు ఆత్మీయంగా స్వాగతం పలికారు.భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు జిల్లెల వెంకట్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్,మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్,మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్,సర్పంచ్ జెట్ట కుమార్, నాయకులు బంటారం మల్లేష్ గౌడ్,రవి యాదవ్,కొమ్ము వెంకటయ్య,శ్రీనివాస్ గౌడ్,రవి నాయక్,నరసింహా,రవి,రమేష్, జంగయ్య,గోపాల్,వడ్ల శ్రీను, శేఖర్,గుండాల శ్రీను,జగన్,శివ తదితరులు, గ్రామస్థులు,భక్తులు పాల్గొన్నారు.

# మల్లికార్జున్ నగర్‌లో ఘనంగా గణనాథుని పూజలు



**నాచారం, (ప్రజావినికిడి):** మల్లాపూర్ శక్తిసాయినగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ కాలనీలో గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వేముల రాజు దంపతులు, వేముల రమేష్ దంపతులు గణపయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు గణనాథునికి పుష్పాలు,పండ్లు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కాలనీలో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.గణపతి బప్పా మోరియా నినాదాలతో మల్లికార్జున్ నగర్ మార్మోగింది.

# కొత్తూరు,ఇన్ముల్ నర్వ,కొడిచెర్ల తాండ,కాజిగూడ తాండలో
# పలు అన్నదాన కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**కొత్తూరు,(ప్రజావినికిడి):**అన్నం పరబ్రహ్మ స్వరూపం అని సనాతన ధర్మం చెప్తుందని జీవుల మనుగడకు ఆహారమే ఆధారం.అందరికీ సరిపడా ఆహారం ఉన్నప్పటికీ,అది ప్రతి ఒక్కరి కంచం వరకు చేరని పరిస్థితి ఉందిని అందుకే ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అన్నిటికంటే గొప్ప దానంగా భావించారు మన పూర్వీకులు అని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు.శనివారం కొత్తూరు మున్సిపాలిటీ మరియు మండలంలోని ఇన్మూల్ నర్వ,కొడిచెర్ల తాండ,కాజిగూడ తాండలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై మండపంలో ప్రత్యేక పూజలు చేసి పలు అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ,అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తూరు మాజీ కౌన్సిలర్లు మాదారం నరసింహులు,శ్రీనివాస్ గౌడ్,సోమ్లా నాయక్,మాజీ ఎంపిటిసి మాదారం క్రిష్ణ,మాజీ ఎంపిటిసి కిషన్ నాయక్ మాజీ సర్పంచ్ సంతోష్ నాయక్,ఎస్టీ సెల్ అధ్యక్షులు బిచ్య నాయక్,ఉపసర్పంచ్ స్వప్న రాందాస్,నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి,శివచారి,ఎడ్ల బాల్ రాజు, ప్రభాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి బండి క్రిష్ణ,ఎరుకలి విష్ణుమూర్తి,అనిల్ రాఘవేందర్,శ్రీధర్ కుమార్, గోపాల్,హరినాథ్ రెడ్డి,రాజవర్ధన్ రెడ్డి,శశిధర్ రెడ్డి, డీలర్ కుమార్,కేసీఆర్,రాజేష్,సంతోష్ భాను,రవి, మహేందర్, రాకేష్,పాండు, భరత్,నరేష్ నవీన్,నరసింహ, గోపాల్ నాయక్, రఘు శంకర్,వినోద్ సంతోష్,దాసూర్ లక్ష్మణ్,శంకర్ నాయక్, చందు,లింగం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కుంట బడి పాఠశాలలో మోడ్రన్ మరుగుదొడ్లను
# ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**మున్సిపాలిటీ 25వ వార్డు పరిధిలోని కుంటబండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక మరుగుదొడ్లను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. రాయికల్ టోల్ ప్లాజా వారి ఆర్థిక సౌజన్యంతో ఈ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడితే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.విద్యార్థుల సౌకర్యార్థం ఆధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.పాఠశాలలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాల అవసరాలను పరిశీలించి సాధ్యమైన మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లు పెంటయ్య,రాజు నాయక్, మండల విద్యాధికారి మనోహర్, ముబారక్ అలీ ఖాన్,చందు నాయక్,రవితేజ,శేఖర్,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పలు కాలనీలలో గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న:
# మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్





**నాగోల్,(ప్రజావినికిడి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ పాల్గొని, గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి,భక్తుల కోసం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత అలాగే స్థానిక ప్రజలు చింతల అరుణా సురేందర్ యాదవ్ కు ఘన స్వాగతం పలికారు.గణేష్ నవరాత్రులు ప్రజలందరిలో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం పెంపొందించేలా ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించుకోవడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.

**సందర్శించిన కాలనీలు:**
జైపూరి కాలనీ ఆదర్శనగర్ కాలనీ కృష్ణానగర్ శ్రీ భవాని నగర్ నువ్వుల బండ అరుణోదయ కాలనీ త్యాగరాయ కాలనీ అజయ్ నగర్ కాలనీ ఈ కార్యక్రమాల్లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, నూకల పద్మా రెడ్డి కార్యకర్తలు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బండి సంజయ్ మానవత్వం..
## కాన్వాయ్ ఆపి ప్రమాద బాధితులకు సాయం

**సిద్దిపేట సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**
కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని గమనించిన ఆయన, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదానికి గురైన బాధితులను తన భద్రతా వాహనంలోనే ఆసుపత్రికి తరలించి అండగా నిలిచారు.శనివారం సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళుతున్న ఒక కారు రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదం సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి, ముందు సీటులో ఉన్న ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, వెనుక సీటులో కూర్చున్న వారి కుమార్తెకు తల, ముక్కు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళుతున్న బండి సంజయ్ ఈ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, భద్రతా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడంలో స్వయంగా సహాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాలికను, ఆమె తల్లిదండ్రులను వెంటనే తన కాన్వాయ్‌లోని భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్నవారిని సకాలంలో ఆదుకున్న బండి సంజయ్ చొరవను పలువురు అభినందించారు.

# జీవో 118 ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ ధృవపత్రాల పంపిణీ..





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**ఎల్బీనగర్ నియోజకవర్గంలోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం నందు జీవో 118 ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ ధృవపత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,పొన్నం ప్రభాకర్,అజారుద్దీన్ మరియు ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి..ఈ కార్యక్రమంలో పలువులు నాయకులు,అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.


# చెన్నగోని శ్రీధర్ గౌడ్ జన్మదిన వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**హయత్ నగర్ డివిజన్ బారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా హయత్ నగర్ స్వామి శంకర్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంప్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..ఈ కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు,డివిజన్ల అధ్యక్షులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు

# జన్వాడ ఫాంహౌస్.. నాలాపై కట్టిన అక్రమ నిర్మాణమే: కాంగ్రెస్ ఎంపీలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 19:(ప్రజావినికిడి):**



రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని వివాదాస్పద ఫాంహౌస్‌ను (కేటీఆర్ ఫాంహౌస్ గా ఆరోపణలు) కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం ఈరోజు నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగి కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిశీలన అనంతరం మాట్లాడిన నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి... జన్వాడ ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, మురుగునీటి కాలువ (నాలా) పైనే ఈ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని సంచలన ఆరోపణలు చేశారు.ఇంత పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన ఈ ఫాంహౌస్ భూముల వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు దాగి ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్ రెడ్డి పేరుతో ఈ భూములు ఉన్నప్పటికీ, అసలు యజమానులెవరనే దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫాంహౌస్ నిర్మించారని, శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఉన్న ఈ స్థలాల్లో కేటీఆర్ అర్ధాంగి శైలిమతో పాటు ఆయన అత్తగారి పేరిట కూడా భూములు ఉన్నాయని ఆరోపించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న హయాంలో తన అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించారని, గతంలో ఈ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ కెమెరా ఎగురవేసినందుకు రేవంత్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

# రేవంత్ పిలుపు.. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు పేర్లు సూచించిన దర్శకుడు సందీప్ వంగా

**హైదరాబాద్ సెప్టెంబర్ 19: (ప్రజావినికిడి):**



వరంగల్‌లో కొత్తగా నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి తగిన పేర్లను సూచించాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుపై సినీ పరిశ్రమ నుండి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా, వరంగల్ బిడ్డ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ క్రమంలో రెండు పేర్లను ప్రతిపాదించారు. తన సొంత పట్టణంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కానుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వరంగల్ చారిత్రక వైభవాన్ని, సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఈ విమానాశ్రయానికి పేరు ఉండాలని సందీప్ వంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, 'రుద్రమ అంతర్జాతీయ విమానాశ్రయం (=×ూా)', 'కాకతీయ అంతర్జాతీయ విమానాశ్రయం (ఖ×ూా)' అనే పేర్లను ఆయన ప్రతిపాదించారు. వరంగల్ వాసుల చిరకాల స్వప్నమైన ఈ ప్రాజెక్టును సాకారం చేస్తున్నందుకు ఆయన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.సందీప్ వంగాతో పాటు టాలీవుడ్‌కు చెందిన మరికొందరు ప్రముఖులు సైతం ఈ అంశంపై స్పందించారు. 'దసరా' చిత్ర దర్శకుడు శ్రీకాంత్ ఓదెల 'సమ్మక్క-సారలమ్మ అంతర్జాతీయ విమానాశ్రయం' పేరును ప్రతిపాదించగా, నటుడు మరియు నిర్మాత బండ్ల గణేశ్ 'రాణి రుద్రమదేవి అంతర్జాతీయ విమానాశ్రయం, వరంగల్' అనే పేరు సముచితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

మరోవైపు, ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (దిల్ రాజు) సైతం విమానాశ్రయ నిర్మాణ నిర్ణయాన్ని స్వాగతించింది. ఈ విమానాశ్రయం ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా, వరంగల్ పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లకు మరింత వెసులుబాటు, ప్రోత్సాహం లభిస్తుందని ఆ సంస్థ పేర్కొంది.

# ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో ఏబీవీపీ హవా..
## మూడు పదవులు కైవసం

**సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**

ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల ఫలితాల్లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ప్రధానమైన నాలుగు స్థానాలకు గానూ మూడింటిని ఏబీవీపీ కైవసం చేసుకుంది. కాగా, ఉపాధ్యక్ష పదవిలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించి సరికొత్త చరిత్ర సృష్టించారు. దాదాపు 20 రౌండ్ల పాటు అత్యంత ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల అధికారులు తుది ఫలితాలను వెల్లడించారు.




ఏబీవీపీ తరఫున అధ్యక్ష పదవికి పోటీ చేసిన యశ్ దబాస్ 24,576 ఓట్లతో ఘనవిజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనా (22,523 ఓట్లు)పై ఆయన గెలుపొందారు. అదేవిధంగా కార్యదర్శిగా రియా ఛావడి (21,650 ఓట్లు), సంయుక్త కార్యదర్శిగా లక్ష్య రాజ్ సింగ్ (16,615 ఓట్లు) ఏబీవీపీ నుంచి విజేతలుగా నిలిచారు.మరోవైపు, ఉపాధ్యక్ష పదవికి జరిగిన పోరులో స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ సంచలన విజయాన్ని నమోదు చేశారు. ఆయనకు ఏకంగా 30,615 ఓట్లు పోలవ్వడం విశేషం. ఈ పదవికి పోటీపడిన ఏబీవీపీ అభ్యర్థి ఇషు మౌర్యకు 16,910 ఓట్లు, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి వీర్ చత్రత్‌కు కేవలం 4,313 ఓట్లు మాత్రమే దక్కాయి. గతంలో ఎన్ఎస్‌యూఐ సభ్యుడిగా ఉన్న దీపాంశు, ఈసారి స్వతంత్రుడిగా బరిలోకి దిగి విజయం సాధించడం గమనార్హం.ఇదిలా ఉండగా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు క్యాంపస్ లోపల గానీ, వెలుపల గానీ ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని ఎన్నికల అధికారులు గెలిచిన అభ్యర్థులకు, వారి మద్దతుదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# వైసీపీ హయాంలో లడ్డూ కల్తీ వార్తలను ఖండించిన రోజా

**భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దని వ్యాఖ్య**

**జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ**

**సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీపై సాగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్వామివారి ప్రసాదాలు అత్యంత పవిత్రమైనవని... కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కోట్లమంది భక్తుల నమ్మకాలతో, భావోద్వేగాలతో ఆడుకోవడాన్ని కూటమి నేతలు తక్షణమే కట్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ నిజమేంటో స్పష్టంగా బయటపడిందని పేర్కొన్న రోజా... జగన్ హయాంలో కల్తీ జరిగిందంటూ వైసీపీపై చేస్తున్న విషప్రచారానికి స్వస్తి పలకాలన్నారు. జగన్ పాలన పచ్చిపాలు లాంటిదని, అక్కడ కల్తీకి ఎంతమాత్రం ఆస్కారం లేదని అన్నారు. నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్న నెయ్యి ట్యాంకర్లను టీటీడీ బోర్డు తనిఖీల్లోనే తిరస్కరించి వెనక్కి పంపినప్పుడు, ఆ నెయ్యి ప్రసాదాల్లో కలవలేదని స్పష్టమవుతున్నా, జంతువుల కొవ్వు కలిసిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్య ప్రచారం చేయడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరచడమేనని రోజా తన పోస్ట్‌లో నిలదీశారు.

# టిడ్కో కాలనీకి ప్రత్యేక బస్సు

## -ఎమ్మెల్యే వెనిగండ్ల చొరవతో సర్వీసు ప్రారంభం



**గుడివాడ, సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):** టిడ్కో కాలనీ వాసుల రవాణా సమస్యకు పరిష్కారం లభించింది. గుడివాడ-టిడ్కో కాలనీ మధ్య ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసును ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడిచే ఈ సర్వీసులో స్థానికులతో కలిసి టిడ్కో కాలనీ నుంచి గుడివాడ ఆర్టీసీ డిపో వరకు ఎమ్మెల్యే రాము ప్రయాణించారు. మహిళలకు జీరో ఫెయిర్ టికెట్లను స్వయంగా అందజేశారు. టిడ్కో కాలనీ ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రత్యేక బస్సు సర్వీసు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ప్రజా వేదికలో ఆర్టీసీ అధికారులతో సమావేశమైన రాము, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే ప్రత్యేక సర్వీసు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన చొరవతో రెండు రోజులు పూర్తికాకముందే సర్వీసు ప్రారంభం కావడంతో ఆర్టీసీ అధికారులను అభినందించారు. ప్రత్యేక చొరవ చూపిన గుడివాడ ఆర్టీసీ డీఎం సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు. ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళల పట్ల ఆర్టీసీ సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించడమే లక్ష్యమని రాము తెలిపారు. గుడివాడకు త్వరలో మరిన్ని మెగా ప్రాజెక్టులు రానున్నాయని, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నామని చెప్పారు. రాజకీయ విమర్శల కంటే ప్రజలకు సేవలందించడానికే ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సత్యనారాయణ, జనసేన గుడివాడ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పంద్రాజు సాంబశివరావు, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళి, చేకూరు జగన్మోహన్‌రావు, కొడాలి రామరాజు, టిడ్కో కాలనీ టీడీపీ అధ్యక్షురాలు బోయిన జ్యోతి, టీడీపీ నాయకులు లింగం ప్రసాద్, వేశపోగు ఇమ్మానుయేలు, కంచర్ల సుధాకర్, దివ్య చౌదరి, జునపూడి నిరంజన్, టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నివాసితులు, ఆర్టీసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# పిఠాపురం నియోజక వర్గంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- పిఠాపురంలో రెండు రోజులపాటు పర్యటన
- పెద్ద ఎత్తున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- రూ. 200 కోట్లతో పిఠాపురంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ
- రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్
- అమృత్ పథకం ద్వారా పిఠాపురం మున్సిపాలిటీకి తాగునీరు
- ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులకు అధునాతన లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు
- స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాల అందజేత
- 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ
- ప్రజలకు అందుబాటులోకి రానున్న "పీఠికాపుర వనం" ప్రారంభం
- ఆధునీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం ప్రారంభోత్సవం




**అమరావతి, సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**

పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన మాట మేరకు ప్రతి అడుగు అభివృద్ధి వైపు వేస్తున్నారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు. తన శాఖల పరిధిలోనే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల సహకారంతో నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు. దశాబ్దాలుగా ప్రజలకు అసాధ్యం అనుకున్న ఎన్నో అభివృద్ధి పనులను సుసాధ్యం చేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నారు. సార్వత్రిక ఎన్నికల విజయం అనంతరం తొలి అడుగులోనే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శ్రీ పవన్ కళ్యాణ్ గారు శ్రీకారం చుట్టారు. సోమవారం నుంచి రెండు రోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న ఉప ముఖ్యమంత్రివర్యులు, దాదాపు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, తాగునీటి సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, మత్స్యకారుల సంక్షేమం, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పలు కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

సోమవారం ఉప్పాడ కొత్తపల్లి, పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని దాదాపు 52 ఆవాసాలకు చెందిన 97 వేల మందికి పూర్తి స్థాయి అవసరాలకు తగిన విధంగా తాగునీటి సరఫరా చేసేందుకు వీలుగా పునరుద్ధరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు పూర్తి స్థాయి తాగునీరు అందడం లేదన్న విషయాన్ని గుర్తించి, రూ. 9.59 కోట్లతో శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆధునీకరణ పనులు చేపట్టారు. దీనితోపాటు పిఠాపురం పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో భాగంగా నిర్మించిన పీఠికాపురవనాన్ని ప్రారంభించనున్నారు. చందుర్తి, తాటిపర్తి బీటీ రోడ్లు, సుందరీకరించిన ఎఫ్.కె. పాలెం మైసమ్మ చెరువులను కూడా శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఈ పర్యటనలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో పిఠాపురం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అందులో రూ. 307 కోట్ల జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల నిధులతో మల్టీ విలేజ్ స్కీం, రూ. 200 కోట్లతో పిఠాపురం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్ల ఏఐఐబీ నిధులతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, అమృత్ 2.0 నిధులతో పిఠాపురం మున్సిపాలిటీ వాటర్ వర్క్స్, మరో రూ. 100 కోట్ల సాస్కీ నిధులతో నిర్మించనున్న రోడ్లు, రూ. 118 కోట్ల విలువైన పిఠాపురం ప్రజల చిరకాల కోరిక రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్ల ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ, పిఠాపురం మల్టీ విలేజ్ స్కీం తాగునీటి పథకం, పిఠాపురం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, గొల్లప్రోలు వాటర్ వర్క్స్ తదితర అభివృద్ధి పనులు ఉన్నాయి.

వీటితోపాటు ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో భద్రతతో కూడిన భరోసా నింపుతూ... అధునాతన లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చేలా స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు సెర్ప్, మెప్మాల సహకారంతో అందజేయనున్నారు. 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందజేసి వారి భూ హక్కులకు భరోసా కల్పించనున్నారు. రెండు రోజుల పర్యటన ఆద్యంతం శ్రీ పవన్ కళ్యాణ్ గారు నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు

# మీ ఇంటిపై సర్వ హక్కులు మీవే

**నా జీవితం ధన్యమైంది.**

**. ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను: విశాఖలో చంద్రబాబు ఎమోషనల్**

**విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ**

**విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన**

**గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ**

**గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు**



**విశాఖ, సెప్టెంబర్ 19(ప్రజావినికిడి):**

విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

**దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!**

"కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు.

"నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. "నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

**మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు**

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!**

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ.10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

**విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!**

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు.

విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలని కోరారు. "2047 నాటికి 'వికసిత భారత్'తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది. అదే సమయంలో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# అసౌకర్యాల నడుమ ఆసియా క్రీడలు ప్రారంభం

**నగోయోలో వసతి ఏర్పాట్లకు తీవ్ర కొరత**

**ఐఓఏ రూ.3కోట్లతో అథ్లెట్లకు బస ఏర్పాటు**

**నగోయో:** 20వ ఆసియా క్రీడలు జపాన్‌లోని ఐచి-నగోయో వేదికగా శనివారం నుంచి ప్రారంభం కాగా.. వసతి ఏర్పాట్లు, ప్రయాణ, భోజన ఏర్పాట్లపై అథ్లెట్లనుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇక భారత షాట్‌పు టర్ తజిందర్‌పాల్ సింగ్ తూర్‌తో పాటు అథ్లెట్లకు నిర్ణీత సమయానికి అందాల్సిన కిట్ అందకపోవడంతో తజిందర్ స్థానంలో కబడ్డీ క్రీడాకారుడు పవన్ సెహ్రావత్ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గోనాల్సి వచ్చింది. ఈ విషయంపై తజిందర్ పాల్ స్పందిస్తూ.. 'నా అఫీషియల్ కిట్ భారత్‌లోనే ఉంది. అది మధ్యాహ్నం 3 గంటల కు నగోయాకు వస్తుందన్నారు. నగోయా విమానాశ్రయానికి వెళ్లి ఆ కిట్ అందుకొని ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొనడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవాలకు రాలేనని భారతీయ ఒలింపిక్ సంఘానికి(ఐఓఏ) సమాచారం అందించా.. అలాగే అథ్లెటిక్స్ టీమ్‌లో ఎవరికీ ఇప్పటివరకు కిట్లు అందలేదని' తెలిపాడు. **వసతి ఏర్పాట్లపైనా తీవ్ర విమర్శలు..**వసతి, భోజన సాధన ఏర్పాట్లపై అథ్లెట్లు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా నగోయోలో ఉన్న అథ్లెట్లు అక్కడి సౌకర్యాలు, ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో నిద్రపోవడం కష్టంగా ఉందంటూ పోస్టులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆసియా క్రీడల కమిటీ చైర్మన్ తయ్యబ్ ఇక్రమ్ మాట్లాడుతూ.. పెద్ద క్రీడా ఈవెంట్ల నిర్వహణలో పలు సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని, గత కొన్ని రోజులుగా వసతి, ఇతర సౌకర్యాల విషయంలో అథ్లెట్లు తీవ్ర విమర్శలు చేస్తున్న మాట వాస్తవమేనని, కొన్ని సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని, దీనిని రాజకీయం చేయడం సరికాదన్నారు. వాటన్నింటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని, అథ్లెట్ల ప్రాక్టీస్‌కు వసతి గదుల వద్ద సాధన కిట్లను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే 2030,



2034 ఆసియా క్రీడల్లో గేమ్స్ విలేజ్‌లు కూడా ఇలానే ఉంటాయని చెప్పడం, ఖర్చులు తగ్గించుకోవడానికి ఇలా చేశామని ఆయన బహిరంగంగా ప్రకటించడం పలు విమర్శలకు దారితీసింది.

**ఐఓఏ సొంత ఖర్చులతో...**నగోయాలో గదుల కొరత తీవ్రంగా ఉండటంతో భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ) దాదాపు రూ.3కోట్ల రూపాయల సొంత ఖర్చులతో ఆఘమేఘాలమీద ఏర్పాట్లు చేసింది. ప్రారంభోత్సవ వేడుకల నాటికి భారత పూర్తి బృందం(503మంది అథ్లెట్లు) నగోయాకు చేరుకోనున్న క్రమంలో ఐఓఏ ఈ ఏర్పాట్లు చేసింది. అలాగే అథ్లెట్లు తీసుకొనే ఆహారం(డైట్) విషయంలోనూ కొరత ఉంది. అథ్లెట్లకు నిర్దిష్టమైన క్యాలరీల అవసరం ఉంటుంది కాబట్టి అందులో ఏమైనా సమస్య ఉంటే అది నిర్వాహకులపై చెడు ప్రభావం చూపుతుందని, అవసరమైన మెనూల రకాలపై సంప్రదించిన తర్వాతే క్యాటరింగ్‌కు ఆర్డర్ చేయనున్నట్లు సమాచారం. ఇక 2038 ఆసియా క్రీడలకు ఆతిథ్య హక్కుల రేసులో ముందంజలో ఐఓఏకి ఇది పెద్ద ఎదురుదెబ్బ అని చెప్పవచ్చు. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి.టి. ఉష, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవియా ముఖ్య అతిథులుగా హాజరైన ఆసియా క్రీడల ప్రారంభోత్సవం నాటికి త్రివర్ణ పతకం, అథ్లెట్ల కిట్స్ సరైన సమయానికి అందరకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. **మను బకర్ భావోద్వేగం...** ప్రారంభోత్సవ వేడుకల్లో భారత త్రివర్ణ పతకాన్ని మోసిన ఒలింపిక్ పతక విజేత మను బకర్ భావోద్వేగానికి గురైంది. తనకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజున తన దివంగత కోచ్ జస్పాల్ రాణా లేకపోవడం తనను కలచివేసిందని ఆమె పేర్కొంది. "ఈ రోజు జస్పాల్ సార్‌ను చాలా మిస్ అయ్యాను. నా పక్కన ఆయన లేకపోవడం నిజంగా ఒక భావోద్వేగ భరితమైన రోజుగా అనిపించింది," అని ప్రారంభోత్సవ వేడుకల అనంతరం ఆమె తెలిపింది. మాజీ ఒలింపిక్ ఛాంపియన్ షూటర్, కోచ్ జస్పాల్ రాణా, జూన్ 11న 49 ఏళ్ల వయసులో కన్నుమూశా రు. భాకర్ కెరీర్‌లో ఆయన ఎంతో కీలక పాత్ర పోషించడమే కాకుండా, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించేలా మార్గనిర్దేశం చేశారు.



# తెలంగాణ షో జంపింగ్ చాంపియన్‌షిప్ షురూ

హైదరాబాద్: నాసర్ పోలో -- ఈక్వెస్ట్రియన్ అకాడమీ వేదికగా తెలంగాణ షో జంపింగ్ చాంపియన్‌షిప్ శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. యువ రైడర్లు తమ గుర్రాలతో ప్రదర్శించిన విన్యాసాలు అలరించాయి. 115-120 సెం.మీ షో జంపింగ్ ఓపెన్ కేటగిరీలో ది అశ్వ కలెక్టివ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మహమ్మద్ హాషమ్ కాని కాంగ్ గుర్రంపై అద్భుత ప్రదర్శన చేసి మొదటి స్థానంలో నిలిచాడు. డెల్లానో డబ్ల్యూ గుర్రంపై స్వారీ చేసిన స్నేథిల్ (కోవై స్టేబుల్స్) రెండో స్థానం సాధించగా, ది అశ్వ కలెక్టివ్ కే చెందిన మహమ్మద్ అమాన్ అలీ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.

# స్టేట్ ర్యాంకింగ్ టీటీ విజేత జతిన్




హైదరాబాద్: జేఈఈ, ఈఏమ్‌సెట్ పోటీ పరీక్షల కోసం రెండేళ్ల పాటు క్రీడలకు దూరంగా ఉన్న తెలంగాణ యువ ప్యాడ్లర్ జతిన్ దేవ్ అద్భుత పునరాగమనం చేశాడు. తెలంగాణ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అండర్-19 బాలుర విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో జతిన్ 4-1 తేడాతో ప్రియాన్‌పై విజయం సాధించాడు. 2024 నేషనల్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌గా, వివిధ కేటగిరీల్లో ఆరుసార్లు స్టేట్ చాంపియన్‌గా నిలిచిన జతిన్ దేవ్ ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ (ఏఐఎంఎల్) చదువుతున్నాడు. రీఎంట్రీ ఇచ్చిన తొలి టోర్నీలోనే అండర్-19 టైటిల్ గెలిచి తన సత్తాను చాటుకున్నాడు.




# తెక్‌బాల్ సెమీస్‌లో కంగుతిన్న డిసౌజా.. ఇక ఆశలన్నీ కాంస్యంపైనే..!

జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో పసిడి పతకంపై ఆశలు రేపిన క్విన్సీ డిసౌజా నిరాశపరిచింది. ఆరంభ వేడుకల రోజే తను 'తెక్‌బాల్' సెమీస్‌లో అనూహ్యంగా ఓటమి పాలైంది. మహిళల సింగిల్స్‌లో సుమయా(ఇండోనేషియా) చేతిలో పరాజయం చవిచూసిన డిసౌజా ఆదివారం కాంస్యం కోసం పోరాడనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కే చెందిన మొహమ్మద్ అనస్ ఇమ్రాన్ బేగ్‌తో కలిసి మూడో స్థానంలో నిలిచేందుకు తను సిద్ధమవుతోంది.అరంగేట్రం ఆసియా క్రీడల్లో గ్రూప్ దశలోనే అత్యధిక పాయింట్లతో చరిత్ర సృష్టించిన క్విన్సీ డిసౌజా తెక్‌బాల్ సెమీఫైనల్ దాటలేకపోయింది. వరస సెట్లలో తేలిపోవడంతో తను ఇక కాంస్యంపైనే ఆశలు పెట్టుకుంది. శనివారం సుమయా (ఇండోనేషియా)తో జరిగిన మ్యాచ్ ఆరంభంలో దూకుడు కనబరిచిన 24 ఏళ్ల డిసౌజా తొలి సెట్‌ను 12-7తో గెలుచుకుంది. కానీ, రెండో సెట్‌లో భారత అథ్లెట్ జోరుకు సుమయ అడ్డుకట్ట వేస్తూ.. 12-9తో విజయం సాధించి స్కోర్ సమం చేసింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో డిసౌజా పుంజుకున్నా సరిపోలేదు. చివరకు 12-7తో భారత అథ్లెట్‌ను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది సుమయా.ఫైనల్ బెర్తు చేజారినా నగోయలో పోడియం మీద నిల్చునేందుకు డిసౌజాకు ఇంకా అవకాశముంది. కాంస్య పతక పోరులో భాగంగా.. మూడో స్థానం కోసం కంబోడియాకు చెందిన క్రీడాకారిణి కొయెంయాన్ డీని డిసౌజా ఎదుర్కోనుంది. గ్రూప్ దశలో కొయెంయాన్‌ను చిత్తు చేసి నేరుగా సెమీస్ చేరిన భారత అథ్లెట్.. ఈసారి కూడా అదిరే ఆటతో ప్రత్యర్థికి చెక్ పెట్టాలనుకుంటోంది. సెప్టెంబర్ 20 ఆదివారం ఉదయం 10 గంటలకు వీరి మ్యాచ్ జరుగనుంది.

# సెమీస్‌లో క్విమ్సీ ఓటమి



టెక్‌బాల్‌లో భారత ప్లేయర్ క్విన్సీ డిసౌజా ఫైనల్ చేరే అవకాశాన్ని చేజార్చుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో 24 ఏండ్ల క్విమ్సీ 12-7, 9-12, 7-12తో ఇండోనేషియాకు చెందిన సుమయా చేతిలో ఓటమి పాలైంది. తొలి గేమ్ నెగ్గినా అదే జోరు కొనసాగించలేకపోయింది. దాంతో ఆదివారం జరిగే కాంస్య పోరులో పతక అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

# భారత్, శ్రీలంకకు షాకిస్తూ.. టీ20ల్లో అగ్రస్థానానికి ఇంగ్లండ్..!




అంతర్జాతీయ పురుషుల టీ20ల్లో ఇంగ్లండ్ జోరు కొనసాగుతోంది. స్వదేశంలో భారత్‌ను వైట్‌వాష్ చేసిన ఇంగ్లండ్.. ఇప్పుడు శ్రీలంక(రాతీఅశ్రీఘఅఝ)ను క్లీన్‌స్వీప్ చేసి ఐసీసీ నంబర్ 1 ర్యాంక్ పట్టేసింది. రెండు రోజుల క్రితం రెండో స్థానంలో ఉన్న హ్యారీబ్రూక్ సేన మూడో టీ20లో అద్భుత విజయంతో టీమిండియాను వెనక్కి నెట్టింది. 1,1021 పాయింట్లు, 269 రేటింగ్స్‌తో అగ్రస్థానానికి ఎగబాకింది ఇంగ్లండ్.స్వదేశంలో పంజా విసురుతున్న ఇంగ్లండ్ పురుషుల టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపింది. ఈమధ్యే సొంతగడ్డపై ఐదు టీ20ల సిరీస్‌లో భారత జట్టును వైట్‌వాష్ చేసిన హ్యారీ బ్రూక్ సేన.. ఈసారి శ్రీలంక పని పట్టింది. మూడు టీ20ల సిరీస్‌లో లంకను చిత్తు చిత్తుగా ఓడించిన ఇంగ్లండ్ నంబర్ 1 ర్యాంకు కైవసం చేసుకుంది.



# సినిమాలకు ఇక కఠిన నిబంధనలు..

## డ్రగ్స్ సీన్లపై తప్పనిసరి హెచ్చరిక!

సినిమాల్లో ఏం చూపించాలనే విషయంలో ఇక మరింత కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. డ్రగ్స్, హింస, లైంగిక హింస, చిన్నారులపై వేధింపుల వంటి సున్నిత అంశాల చిత్రీకరణపై కేంద్రం కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చింది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శుక్రవారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)కు సంబంధించిన సవరించిన మార్గదర్శకాలను ప్రకటించింది. 1991లో జారీ చేసిన నిబంధనల స్థానంలో ఇవి వచ్చాయి.డ్రగ్స్ తీసుకోవడం లేదా అక్రమంగా తరలించే సన్నివేశాలు ఉంటే ఇక తెరపై తప్పనిసరిగా హెచ్చరిక కనిపించాలి. »»Illicit narcotics destroy health and guarantees imprisonment. Say No To Drugs” అనే సందేశాన్ని ప్రదర్శించాలి. మద్యం, డ్రగ్స్, పొగాకు అలవాట్లను సమర్థించేలా లేదా గొప్పగా చూపించే సన్నివేశాలు సినిమాల్లో ఉండొద్దని నిబంధనలు చెబుతున్నాయి.

హింసను సమర్థించేలా కానీ, గొప్పగా చూపించేలా కానీ సన్నివేశాలు ఉండకూడదు. మహిళలను కించపరిచే సన్నివేశాలు, లైంగిక వేధింపులు, లైంగిక హింసను అవసరానికి మించి చూపించకూడదు. కథకు తప్పనిసరిగా అవసరమైన సందర్భాల్లోనూ ఇలాంటి సన్నివేశాలను సాధ్యమైనంత తక్కువగా ఉంచాలని నిబంధనలు చెబుతున్నాయి.చిన్నారులను హింసకు బాధితులుగా, హింసకు పాల్పడేవారిగా చూపించడాన్ని కూడా నివారించాలని సూచించారు. పిల్లలపై ఎలాంటి వేధింపులనూ చూపించకూడదు. దివ్యాంగులను ఎగతాళి చేసేలా, అవమానించేలా సన్నివేశాలు ఉండకూడదు. జంతువులపై అనవసరమైన హింసను కూడా చూపించొద్దని నిబంధనల్లో స్పష్టం చేశారు.మతాలు, వర్గాలను కించపరిచేలా ఉండే మాటలు, దృశ్యాలపై ఆంక్షలు కొనసాగనున్నాయి. సామాజిక విద్వేషం, మూఢనమ్మకాలు, శాస్త్రవిరుద్ధ భావనలు, దేశ వ్యతిరేక ధోరణులను ప్రోత్సహించే కంటెంట్‌కు కూడా చోటు ఉండదు. కోర్టుల గౌరవాన్ని దెబ్బతీసే సన్నివేశాలపైనా నిబంధనలు ఉన్నాయి.

# ఆ హాలీవుడ్ రీమేక్‌లో ఉచితంగానైనా నటిస్తా : విజయ్ సేతుపతి

విలక్షణ నటనతో దక్షిణ భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ‘మక్కల్ సెల్వన్’ విజయ్ సేతుపతి తన రాబోయే చిత్రాలు, హాలీవుడ్ రీమేక్ ఆఫర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దర్శకుడు నిథిలన్ స్వామినాథన్ తనకు ‘మహారాజా 2’ కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని వెల్లడించారు. ‘మహారాజా’ మొదటి భాగం విడుదల కాకముందు కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, తాను మాత్రం సినిమా విజయంపై గట్టి నమ్మకంతో ఉన్నానని గుర్తుచేసుకున్నారు.

అంతేకాకుండా, ‘మహారాజా’ సినిమాకు సంబంధించి ఇటీవల హాలీవుడ్ నుంచి ఒక భారీ సర్ ప్రైజ్ వచ్చిందని విజయ్ సేతుపతి తెలిపారు. ఈ సినిమా రీమేక్ హక్కులను హాలీవుడ్ సంస్థ దక్కించుకుందని, అందులో ప్రముఖ హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కొనాహే నటించబోతున్నారని నిర్మాత తనకు ఫోన్ చేసి చెప్పినట్లు వివరించారు. ఈ వార్త విన్నవెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని... “ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు ఒక చిన్న పాత్ర ఇప్పించండి. ఉచితంగా నటిస్తాను“ అని నిర్మాతతో సరదాగా అన్నట్లు పంచుకున్నారు. మొదటి నుంచి హాలీవుడ్‌లో నటించాలనే కోరిక ఉందని, తన చిత్రం అక్కడ రీమేక్ కావడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు.





# ఆస్కార్ రేసులో మరాఠీ చిత్రం ‘గోంధాల్‘..

99వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) కోసం భారత్ నుంచి అధికారిక ఎంట్రీగా ఏ చిత్రం వెళ్తుందనే ఉత్కంఠకు తెరపడింది. దేశవ్యాప్తంగా పలు భాషల నుంచి వచ్చిన సినిమాలను పరిశీలించిన ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జ్యూరీ, అనూహ్యంగా మరాఠీ థ్రిల్లర్ చిత్రం ‘గోంధాల్‘ను ఎంపిక చేసింది. ఈ రేసులో గట్టి పోటీదారుగా నిలిచిన, బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.3,000 కోట్లు వసూలు చేసిన రణ్‌వీర్ సింగ్ ‘ధురంధర్‘ ఫ్రాంచైజీకి నిరాశే ఎదురైంది.ఈ ఎంపిక ప్రక్రియలో 14 మంది సభ్యులున్న జ్యూరీలో ఒకరైన వివేక్ వాస్వానీ, ‘ఎన్డీటీవీ‘తో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ‘ధురంధర్‘ సినిమాను ఎందుకు ఎంపిక చేయలేదనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. “కొంతమంది సభ్యులకు ఆ సినిమా నచ్చింది. కానీ, అది ఆస్కార్ స్థాయి సినిమా అని మేము భావించలేదు. మేము ఆశించిన విధంగా అందులో భారతీయ సంస్కృతి ప్రతిబింబించలేదు“ అని స్పష్టం చేశారు. 14 మంది జ్యూరీ సభ్యులలో కేవలం నలుగురు మాత్రమే ‘ధురంధర్‘కు ఓటు వేశారని ఆయన తెలిపారు. మరోవైపు, భారత్ తరఫున ఆస్కార్ బరిలో నిలవనున్న ‘గోంధాల్‘ చిత్రాన్ని సంతోష్ దవాఖర్ రచించి, దర్శకత్వం వహించారు. మహారాష్ట్రలో అర్ధరాత్రి నిర్వహించే ‘గోంధాల్‘ అనే సంప్రదాయ ఆచారాలు, జానపద కళల




నేపథ్యంలో ఈ థ్రిల్లర్ రూపుదిద్దుకుంది. చిత్రంలో భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను బలంగా చూపించడం జ్యూరీని ఎంతగానో ఆకట్టుకుంది.


ఈ చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రశంసలు అందుకుంది. 2025లో జరిగిన 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్‌ఎఫ్‌ఐ)లో దర్శకుడు సంతోష్ దవాఖర్ ఉత్తమ దర్శకుడిగా సిల్వర్ పీకాక్ అవార్డును గెలుచుకున్నారు. ఈ చిత్రంలో కిషోర్ కదమ్, ఇషితా దేశ్‌ముఖ్, యోగేష్ సోహోని ప్రధాన పాత్రలు పోషించగా, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీతం అందించారు.

ఈ ఏడాది ఆస్కార్ ఎంట్రీ కోసం మొత్తం 33 చిత్రాలు పోటీపడ్డాయి. వీటిలో 14 హిందీ, 4 మరాఠీ, 4 తెలుగు, 3 గుజరాతీ, 3 తమిళ చిత్రాలతో పాటు మలయాళం, నేపాలీ, నాగాలాండ్ నుంచి ఒక్కో సినిమా ఉన్నాయి. చివరి దశలో ‘గోంధాల్‘, ‘అంగ్‘, ‘మైనే వాపస్ ఆయుంగా‘ అనే మూడు చిత్రాలు నిలవగా, తుది ఎంపికలో జ్యూరీ ‘గోంధాల్‘ వైపే మొగ్గు చూపింది.

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన ‘ధురంధర్‘ ఫ్రాంచైజీ, 2025 డిసెంబర్, 2026 మార్చిలో రెండు భాగాలుగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా భారీ విజయం సాధించింది. అయినప్పటికీ వాణిజ్య విజయాల కన్నా సాంస్కృతిక ప్రాధాన్యతకే జ్యూరీ పెద్దపీట వేయడంతో ఈ ప్రతిష్ఠాత్మక అవకాశం మరాఠీ చిత్రానికి దక్కింది.

# జీవితంపై అమితాబ్ పాఠం..

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్ వేదికగా జీవితానికి సంబంధించిన ఒక ముఖ్యమైన పాఠాన్ని పంచుకున్నారు. నిరంతర ప్రయత్నం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, జీవితంలోని సవాళ్లను ఆయన ఒక ఆటోమేటిక్ లిఫ్ట్ డోర్‌తో పోల్చారు. ఆయన వ్యక్తం చేసిన ఈ అభిప్రాయాలు ప్రస్తుతం ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాయి.ఈ సందర్భంగా ఆయన ఒక ఆసక్తికరమైన విషయాన్ని ప్రస్తావించారు. “కొన్ని పనులు చెప్పకుండానే జరిగిపోతాయి, మరికొన్ని చెబితే జరుగుతాయి, ఇంకొన్ని కాస్త ఒత్తిడి చేస్తే గానీ పూర్తి కావు. అయితే, ఏదో ఒక మార్గంలో పని జరగడం మాత్రం ఖాయం“ అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిని వివరిస్తూ లిఫ్ట్ డోర్ ఉదాహరణను ఆయన వివరించారు. “లిఫ్ట్ ఆటోమేటిక్ డోర్ కొద్దిసేపటి తర్వాత దానంతట అదే మూసుకుపోతుంది. మనం లోపలికి ప్రవేశించడంలో ఆలస్యం చేస్తే, అది



మూసుకోబోతుంది. కానీ ఆ సమయంలో ఒక చిన్న వేలు అడ్డుపెట్టినా చాలు, అది తిరిగి తెరుచుకుంటుంది“ అని పేర్కొన్నారు.ఈ ఉదాహరణను జీవితానికి అన్వయిస్తూ.. “జీవితంలో కూడా అంతే. ఒక చిన్న ప్రయత్నం సైతం మూసుకుపోయిన తలుపులను తెరుస్తుంది. ఆ ప్రయత్నం ఒక వేలు పెట్టినంత స్వల్పమైనా సరే, ఫలితం ఉంటుంది. ప్రయత్నించకుండా ఏదీ లభించదు! నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండండి... ఏదో ఒక రోజు ఆ తలుపు విసిగిపోయి తనంతట తానుగా తెరుచుకుంటుంది“ అని అమితాబ్ తన సందేశాన్ని ముగించారు. ఎంత చిన్నదైనా సరే, నిరంతరం చేసే ప్రయత్నం చివరికి మూసుకుపోయిన అవకాశాల తలుపులను సైతం తెరుస్తుందన్నదే ఆయన మాటల సారాంశం.

# ప్రతి సీన్ సర్‌ప్రైజ్ చేస్తుంది...

## ‘హతః‘ చాలా స్పెషల్: కిరణ్ అబ్బవరం

యువ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ప్రయాణం సాగిస్తుండడం తెలిసిందే. ఆయన తన సొంత నిర్మాణ సంస్థ ‘కేఏ ప్రొడక్షన్స్‘ బ్యానర్‌పై పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి ‘హతః‘ అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్న ఈ మిస్టికల్ థ్రిల్లర్ మూవీ టీజర్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా విడుదల చేశారు. నవంబర్ 6న



ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా, ప్రతి ప్రేక్షకుడిని ఆశ్చర్యపరిచేలా ఉంటుందని కిరణ్ అబ్బవరం ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, ““హతః‘ మాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. ఈ దీపావళికి ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని అందించబోతున్నాం. సినిమా చూస్తున్నంత సేపు తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ ప్రతి సన్నివేశంలోనూ ఉంటుంది. సినిమా పూర్తయ్యాక, అందులోని లింక్ పాయింట్స్ గుర్తుకు తెచ్చుకోవడానికి నాకే పది నిమిషాలు పట్టింది. దర్శకుడిని అడిగి మరీ అన్ని విషయాలు తెలుసుకున్నాను. అంత లోతైన కథ ఇది. నేను నిర్మాతగా ఈ ప్రాజెక్టులోకి మధ్యలో అడుగుపెట్టాను. ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ ఆస్వాదించేలా ఈ సినిమా ఉంటుంది, అందుకే అన్ని భాషల్లోనూ విడుదల చేస్తున్నాం“ అని వివరించారు.చిత్ర దర్శకుడు అనుష్ గోరక్ మాట్లాడుతూ, “ఇది ఒక మిస్టికల్ థ్రిల్లర్. హారర్ అంశాలు కూడా ఉంటాయి. కథలో చాలా రహస్యాలు ఉన్నాయి, వాటిని థియేటర్లలో చూస్తేనే ఆ అనుభూతి దక్కుతుంది“ అని తెలిపారు. మరో నిర్మాత శివశంకర నాయుడు మాట్లాడుతూ, “ఎలాంటి ప్రాంతీయ హద్దులు లేని అరుదైన సినిమా ఇది. ఏ ప్రాంతం వారు చూసినా తమ కథలాగే అనిపిస్తుంది. సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉంటుంది“ అని అన్నారు.బిగ్ బాస్ షోకి వెళ్లకముందే ఈ చిత్రంలో నటించానని నటి తనూజ పుట్టుస్వామి తెలిపారు. మూడేళ్ల తమ ప్రయాణం గురించి, దర్శకుడి విజన్ గురించి ఆమె వివరించారు. కో-ప్రొడ్యూసర్, నటుడు కుష్లు మాట్లాడుతూ, విజువల్స్ హాలీవుడ్ స్థాయిలో ఉన్నాయని, అనుష్ లాంటి దర్శకులు టాలీవుడ్‌కు అవసరమని అన్నారు.రెహమాన్, కుష్లు, తనూజ పుట్టుస్వామి, నమ్రిత కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో శివశంకర నాయుడు నిర్మిస్తున్నారు. జేసిన్ జార్జ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నవంబర్ 6న థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను పంచేందుకు సిద్ధమవుతోంది.

# బ్లాక్ డ్రెస్‌లో హీట్ పెంచేసిన మృణాల్ ఠాకూర్..



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సీతారామం‘తో చెరగని ముద్ర వేసుకున్న అందాల భామ మృణాల్ ఠాకూర్, తాజాగా పోస్ట్ చేసిన హాట్ పిక్స్‌తో సోషల్ మీడియాలో సెగలు రేపుతోంది. క్లాసీ బ్లాక్ డ్రెస్‌లో తనదైన స్టైల్ మార్క్ చూపిస్తూ ఈ ముద్దుగుమ్మ ఇచ్చిన పోజులు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌లో దేవకన్యలా మెరిసిపోతున్న మృణాల్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్‌ను తీవ్రంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ప్రత్యేక ఫోటోషూట్ కోసం మృణాల్ ఠాకూర్ ‘షాహిన్ మన్నన్‘ బ్రాండ్‌కు చెందిన ప్యాపీ ఫ్లవర్ బ్లౌజ్ అండ్ స్టేట్‌మెంట్ స్కర్ట్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. ఇక ఫుల్ స్లీవ్స్ క్రాప్డ్ బ్లౌజ్, దానికి తగ్గట్టుగా ఉన్న హై-వేస్ట్ ఫుల్లీ ఫ్లేర్డ్ స్కర్ట్‌పై కింద భాగంలో ఎరుపు రంగు పూల ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె లుక్‌కు గ్రాండ్ అప్పీల్‌ను తెచ్చిపెట్టింది. నడుము వద్ద సన్నని బెల్ట్, డోప్ కట్స్‌తో మృణాల్ ఎంతో రాయల్‌గా మెరిసిపోయింది నెట్టింట లైకుల వర్షం: ఈ అద్భుతమైన పిక్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయగానే ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. “బ్రీత్‌టేకింగ్ ప్రిన్సెస్“, “అబ్సల్యూట్లీ స్టన్నింగ్ అండ్ గార్జియస్“, “బ్లాక్ కలర్‌లో నీ అందం వేరే లెవెల్“ అంటూ నెటిజన్లు పొగడ్తలతో నింపేస్తున్నారు. వెలుతురులో చిరునవ్వుతో ఉన్న మృణాల్ పిక్స్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి. బుల్లితెర నుంచి స్టార్ హీరోయిన్ వరకు : మహారాష్ట్రకు చెందిన మృణాల్ ఠాకూర్, ‘కుంకుమ భాగ్య‘ సీరియల్‌తో మంచి పాపులారిటీ సాధించి, ‘లవ్ సోనియా‘ చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ‘సుపర్ 30‘, ‘బాట్లా హౌస్‘ చిత్రాల్లో నటిగా మెప్పించిన ఈ భామ, ‘సీతారామం‘తో పాన్ ఇండియా లెవెల్లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఆ తర్వాత ‘హాయ్ నాన్న‘, ‘జర్సీ‘, ‘ది ఫ్యామిలీ స్టార్‘ వంటి చిత్రాలతో వరుస విజయాలు అందుకుంది.! ఇక రీసెంట్ గా సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి ‘దో దివానే షెహర్ మే‘, అడివి శేష్ సరసన బైలింగువల్ డ్రామా ‘డెకాయిట్: ఏ లవ్ స్టోరీ‘, వరుణ్ ధావన్‌తో కలిసి ‘హై జవానీ తో ఇష్క్ హోనా హై‘ చిత్రాల్లో నటించి మంచి సక్సెస్ అందుకుంది..ఇక తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో పాటు విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకుంటున్న మృణాల్ ఠాకూర్, రాబోయే రోజుల్లో అన్ని భాషల్లోనూ మరిన్ని భారీ విజయాలు సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613